



# మళ్లీ ఒక్కసారి

రచన :
టి. సత్యనారాయణమూర్తి

మెద్రాస్ మెయిల్ వాల్తేరు స్టేషనులో ఆగింది. కర్ణ కఠోరంగా గోలచేస్తున్నారు కుర్రాళ్లు. బెడ్డింగు చేత్తో పట్టుకొని ఏకాఎకీ ఒక్కగంతేశాను ప్లాట్‌ఫారం మీదికి. రష్‌లో కాస్త తడబాటునో లేక గ్రహపాటునో ఒక అమ్మాయికి డాష్‌కొట్టాను. డాష్ అంటే మరేమీకాదు నా బెడ్డింగు తనచేతికి తగిలి, హేండ్ బాగ్ అల్లంతదూరాన పడింది. వెంటనే చురచుర చూసింది విషంగక్కిన పాములా. ఎందుకైనా మంచిదని ముందుగానే 'సారి' అని అస్త్రం పడేశాను. కాని ఆ అస్త్రం పట్ల ఆమె నిరసన భావంచూపి "ఇడియట్'...కళ్ళు లేవు; బేవర్సులా నడవకపోతే, కొంచెం ఒళ్ళు దగ్గరపెట్టుకు నడవరాదు ? ప్రతీ వెధవకి స్టయిల్. బెగ్గర్స్" కదలబోయింది.

బెడ్డింగు కిందవుంచి, ఎడమ చేతిని జేబులోకి పోనిచ్చి, కుడిచేత్తో టై పట్టుకొని దగ్గరకు జరిగాను.

"ఇంకా ఒక్కసారను మేడమ్!... వినాలనివుంది" ఆప్యాయంగా అన్నాను.

"షటప్" ఉరిమినట్టు చూసింది.

బండి పట్టాలు తప్పింది. చెల్‌మని వాయించాలనుకున్నాను. కాని ఓపిక తెచ్చుకొని "నీ నోరా?...నా నోరా?" అన్నాను.

"ఆఁ...నాతోపరాచకాలా రాస్కెల్!" స్లిప్పర్‌తీసి నామీదికి విసరబోయింది. చెయ్యి పట్టుకున్నాను. తిడుతూనే 'విడువు' అని గింజుకొంటోంది. మాట జీరవచ్చింది. అది నాపైని ప్రయోగించకుండా పట్టిన ఉల్లూకపట్టును విడిపించుకోడానికి తన్ను కొంటుంటే, చుట్టూ నలుగురూ మూగారు. ఆడది అబల అఖల అంటారు, అది ఈవిడలో ఎంతవరకూ వర్తిస్తుందో చూస్తున్నారు. నాకదో ఆటలా అనిపించింద. చివరికి ఆమెచెయ్యి విదిలించేసరికి చెప్పు కాస్త బండికిందకు పోయింది. ఆ నెరజాణ ముఖం ఎరుపెక్కి, కన్నీళ్ళు చిమ్ముతున్నాయ్. పొందిన అవమానానికి ప్రతీకారం చెయ్యలేక రుసరుస చూస్తోంది. "ఏ మమ్మా ఆచురుకు? ముందు నోటికివచ్చినట్లల్లా కూసేవు. అతను కాబట్టి అంతటితొ వదలిపెట్టాడు, లేకపోతేనా" అని ఒక మీసాలరాయుడు ముందుకొచ్చి అన్నాడు. మరి సలుగురు వడ్డించకముందే మిగిలిన స్లిప్పర్ విడిచిపెట్టి, హేండ్‌బాగ్ తీసుకొని జారుకొంది.

'బయలుదేరినవేళ బాగులేదు— పాపం' అనుకొని ప్లాట్‌ఫారం దాటాను. బస్‌కోసం ఎదురుచూస్తు నిలబడ్డాను. మొత్తానికి అవమానం ఎవరు పొందినా నాకుమట్టుకు కష్టం అనిపించింది. ఏదో తప్పుచేసిన వాడిలా కృంగిపోయాను. చిన్న పిల్లాడిలా సిగ్గుపడ్డాను. తప్పు ఎవరిది?; నాదికాదె. జరిగిన పొరపాటుకి క్షమాపణ వేసుకోడం ధర్మమా అని వేడుకున్నాను. అంతటితో సరిపోక స్త్రీ జాతికే తీరని కళంకం తెచ్చిపెట్టుకొన్న ఆమె, మంచీచెడ్డ విచక్షణచేయకుండా వెనకాముందూ ఆలోచించక, తనకే వూరంత పౌరుషం వుందంటూ నలుగుర్లోన నానామాటలు అన్నందుకు పొందవలసిన అవమానమె పొందింది. అందుకు నేనా బాధ్యుడ్ని. ఎంత మాత్రం కాను; కానేరను. అంతవరకు ఆలోచించవలసిన అవసరంలేదు. మరెందుకీ ఆరాటం? ఎందుకీ ఆప్యాయం? పశ్చాత్తాప పడవలసిన అవసరం దేనికి? నిజానికి ఈ అంతరంగిక క్షోభకి కారణం అప్పటికిగాని తెలియలేదు. ఆమె ఒక అందమైన ఆడది; కాదు స్టూడెంటు. సూదంటురాయిలా నలుగుర్ని ఆకర్షించే శక్తి ఆమెలోవుంది. ఆనిండు ముఖంలో విలసిల్లే విశాలనేత్రాలు, పెదిమలకు రాసిన లిప్టిక్ మెరుస్తూ, పిడికెడు నడుంతో వలకపోస్తున్న వయ్యారం, ముఖంపై పడుతూన్న కురులు నెట్టుతుంటే చూట్టానికి ప్రతీవాడికి పిచ్చెత్తిస్తాయి. ఎంత అవమాన పరిచాను! ఈ

చేతులు కటిక పాషాణాలై పోయాయె. అరే; ఆమె ఎంత విలపించిందో. నిండు జన సమూహంలో అందలేకుండావున్న ఆ పండు దొండపండును వుండచేసానె. ఆమె మనస్సు గాయపరిచి, తన జీవితాంతం తన్ను వెంటాడగల తీరని మచ్చ తెచ్చిపెట్టిందెవరు?... నేను! ఛీ!



ఎంతపాడు పనికి పూనుకొన్నాను. పోయి క్షమాపణ వేడుకుంటే ?...' ఏడిశావ్! చూస్తున్నకొద్దీ ఆ మతికూడా పోతున్నట్టుంది. ముక్కు మొగం ఎరుగని మనిషిచేత, అదీ ఆడదానిచేత నలుగుర్లోన ఎడాపెడా పెట్టినచీవాట్లు ఆవదం బుద్ధీలా స్వీకరించింది చాలక తిరిగి క్షమాపణ వేడుకుంటాడట...క్షమాపణ! సిగ్గులేదూ?' వెన్నుపై ఎవరో తట్టారు.

చచ్చాంరా ఈ ప్రబుద్ధుడెవడు? మహాదంచేస్తున్నాడు దంపు. చిన్నతనపు చపలత్వంచేత, కాలేజి స్టూడెంటుననే గర్వంచేత, లోకానుభవం తక్కువచేత ఆమె ఏదో తొందరపడితే; యూనివర్సిటీలో పట్టాలుపొందిన నేనేమని తొందరపడతాను? పాపం నావల్ల ఆమె పరువు ప్రతిష్ఠలు నాశన మయ్యాయి. ఏదైనా ఈ స్టూ డె ం ట్సు కు న్న తెగులేఅది. ఎప్పుడూ పోజులు చెక్కుతూ స్టయిల్ మెయింటెయిన్ చేసుకుంటున్నాం అన్న రభసేగాని అది ఎప్పుడు ఎంతవరకు ఎలా దారితీస్తుంది తెలుసుకోరు. కనీసం తెలుసుకుందామనైనా ప్రయత్నించరు. ఎటుచూసినా నావంటి మధ్యతరగతి వారికే పట్టుకుంటుంది బాధ. ఏం చెయ్యను? ఇంతలో సిటీబస్ వచ్చింది, నా ఆలోచనలను భగ్నం చేసింది.

* * *

"నీకో యింటరు చదివిన చక్కని అమ్మాయిని చూచివుంచాను. వెంటనే బయలుదేరి రావలసిందని దంచేస్తున్నాడు మా ఫ్రండు రామం. రామం, నేను చిన్నప్పటినుంచీ స్నేహితులం. ఇద్దరం ఓకే కాలేజీలో చదివి పాస్ అయ్యాం. నేను విశాఖపట్నంలో ఇంజనీరింగ్ కాలేజీలో చేరాను, వాడు స్వస్తి చెప్పి ఉద్యోగం చేసుకుంటున్నాడు. వాడికి నిరుడే పెళ్లయింది. అప్పుడేవాడో సంసారిలా మా కందరికీ హితోపదేశాలు మొదలుపెట్టాడు. "ఇంజనీర్‌గా పని చేస్తున్నావు. నీకేమోయ్, చక్కని చుక్కను పెళ్లాడి నలుగుర్లోను కలియక" యిదేవాడి ప్రతి ఉత్తరంలోని సారాంశం. ఈ మధ్యమరీను, ఎవరో వున్నారని వేధించుకు చంపుతున్నాడు. ఇక వీడిగోల పడలేక బయలు దేరాను కర్నూలు.

"హల్లో! ఏమిటిలా హటాత్తుగా దిగిపోయావ్ వుత్తరంపత్తరం లేకుండా" షేక్‌హాండ్ యిచ్చి యింట్లోకి తీసుకుపోయాడు.

"ఎలావుందిరా పరిస్థితి?" అన్నాను.

"నామట్టుకేంగాని, నువ్వేం పెళ్లి పెడాకులు లేకుండా సన్యాసం పుచ్చుకుంటావా?"

"ఇప్పుడు పెళ్లికేం తొందర; బ్రతికి వుండాలిగాని."

"ఓ హెూ! తత్వాలెప్పుడు నేర్చావు?"

"నీవంటి గురువులున్న తర్వాత తత్వాలేమిటి తంత్రాలుకూడా నేర్వాలి మరి."

ఇద్దరం ఒక్కసారి నవ్వేసాం.

"మంజు! మంజులా! కాఫీ పట్టామ్మ తర్వాత స్నానపానాదులు చూసుకో వచ్చు" ఇంట్లోకి అర్డరిచ్చాడు.

కొద్ది నిముషాల్లో ఒక అమ్మాయి రెండు కప్పులకాఫీ తెచ్చి, టేబిల్ పైని పెట్టింది. తిరిగి పోతూంటే "అఁ ఇటు చూడు; ఇతనే నా ఫ్రండు మూర్తి. క్రింద ఉండే బి. ఇ. పాసయి అసిస్టెంటు ఇంజనీరుగా పనిచేస్తున్నాడు." ఆమె చిరునవ్వునవ్వి నమస్కారం చేసింది. అలానే అందుకుంటూ ష్టన్ అయిపోయాను. గుండె అగినంత పనయింది. జవసత్వాలు క్షీణించి పోయాయ్. క్రింద భూమి గిర్న తిరుగుతోంది. కళ్ళు బైర్లు కమ్మాయి. తనూ అదే పరిస్థితిలో వుంది. బిక్క మొగాలతో చూస్తున్నాం. వున్నట్టుండి గిరుక్కున తిరిగి వెళ్లి పోయింది. 'త నదివరకు వాల్తేరు ప్లాట్ ఫారంలో డాష్అయింది ఈమెతోనే. అనుమానంలేదు. పేరు మంజులా? ఇక్కడికెలా వచ్చింది చెప్మా? రామంకి రెలిటివ్ అయివుంటుంది. వాడి పెళ్ళికి నేరాలేదు. కొంపదీసి వాడి శ్రీమతి కాదుగద. అయితే ఏముంది, ఆవిడ గారువచ్చి చక్కా తన నాధునితో చెపుతూవుంటే, గుడ్లప్పజెప్పి చూడ వలసిందే. అప్పుడుతనకేమన్నా మర్యాద దక్కుతుందా? మున్ముందు ఎలాపరిణమిస్తుందో ఏమో? చూసిచూసి ఈ రొంపిలో ఎందుకు దింపావ్ భగవాన్' భగవాన్' అనుకున్నాను. 'కాఫీ పుచ్చుకోరా, ఏమిటిలా దూలాలు లెక్కపెడతావ్' అని అరిచేంతవరకు ఈ లోకానికి దిగలేదు. కాఫీ సేవించిన తర్వాత తిరిగి సంభాషణకి దింపాడు. నేనూ తమాయించుకున్నాను, కాని యింకా బితుకు పోలేదు.

"మూర్తీ!......నే నొక్కగుతాను చెప్పు, నీ కెటువంటి అమ్మాయిని చేసుకోవాలనివుంది?"

"ఇదేవిటి ప్రశ్న?"

"నీకు కొత్తదైనా, నాకు పాతదే"

"మరి...తప్పదా?"

"ఉహుఁ..."

"అయితేవిను. చక్కని రూపం చదువేగాక, భర్త ఆశయాలను అర్థం చేసుకొని తదనుగుణ్యంగా నడుచుకుంటూ, సంసారం స్వర్గతుల్యం చేయగల వధువు దొరికితే వెంటనే పెళ్లి చేసుకుంటాను." అన్నాను.

"అవన్నీ గలిగివున్న అమ్మాయి నా దగ్గరేవుంటే?"

"అంటే"

"నా చెల్లిలేవుంటే?"

"తప్పక చేసుకుంటాను రామం· నాపట్ల సందేహిస్తున్నావా? నీతో బంధుత్వానికి సంకోచిస్తున్నానను కుంటున్నావా? అలా ఎప్పుడూ జరగదు. నీతో బాంధవ్యం కుదిరేకన్నా నా కింకేం కావాలి?' అప్యాయంగా చేతిలో చేయి వేసి అన్నాను.

'నిన్నర్థం చేసుకోలేదు మూర్తి, క్షమించు" లేచి కౌగలించుకున్నాడు ఇద్దరి ముఖాలు వికసించాయి.

"ఈమంజుల మాపినతల్లి కూతురు. మా ఆవిడ పుట్టింటికి వెడితే ఈమెను తీసుకువచ్చాను. ఇంటరు చదివింది. ప్రస్తుతం బైపు నేరుస్తోంది. తెలివైంది, చురుకైంది. చక్కగా పాడగలదు. ఈమె విషయమే నీతో చెప్పాను. నువ్వు 'వు' అంటేచాలు పై విషయమంతా నేను చూసుకుంటాను."

"నేను నువ్వు వొప్పుకుంటే సరిపోతుందటోయ్ నీపిచ్చిగాని" అని కిటికీ వైపు చూసాను. అంతవరకూ పొంచి వింటున్న ఆమె నన్నుచూసి తప్పుకొంది.

"అదా నీవుద్దేశ్యం, మంజుల ఎప్పుడూ నా మాట కాదనదు. కావలిస్తే నీ ముందే వినిపిస్తాచూడు" అని "అమ్మా మంజులా! మంజులా!" పిలిచాడు.

మెల్లగావచ్చి ద్వారం వద్ద నిలబడింది. ఇందాకంత చురుకులేదు. తల దించేసుకొంది.

"ఇదంతా నువ్వు విన్నావన్నమాట. అయితే చెప్పు మూర్తితో వివాహం ఇష్టమేనా?" అడిగాడు.

మౌనంగా వుండిపోయింది.

"మౌనం అంగీకార సూచనలేరా మూర్తి"

"అదేం లాభంలేదు" పట్టు పట్టాను.

"చెప్పమ్మ పరవాలేదు" అన్నాడు లేస్తూ.

"మీ యిష్టం" కష్టంగా ముసుగు తెరలోంచి అని తుర్రుమంది.

పకాలున నవ్వేసుకున్నాం.

పెళ్ళయిన మూడోరోజున గదిలో చదువుకుంటున్నాను. తలుపు దబాలున మూసినచప్పుడయింది. మంజును గదిలోకినెట్టి తలుపువేసారు. లేచి దగ్గరగావెళ్ళి "మైడియర్ షటప్!" కాళ్ళకి స్లిప్పర్లు లేవుకదా?" అన్నాను. సిగ్గుతో ముడుచుకు పోయింది. దగ్గరగా తీసుకొని కౌగలించుకున్నాను. నిస్సహాయంగా వాలిపోయింది నాపైన. నిశీధిలో కారుమేఘం ఒకటి కప్పి పుచ్చింది చంద్రుణ్ణి!

★